




# కరపత్రం

SINCE 2014

బుధవారం అక్టోబరు 15 2025 | సంపుటి : 2 | సంచిక : 12 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## 16న తెలంగాణ క్యాబినెట్ భేటీ..

### బీసీ రిజర్వేషన్ల కోటాపై చర్చ..




2లో..

## పూరన్ ఆత్మహత్యపై సత్వర దర్యాప్తు

**ఉన్నతస్థాయిలో కూడా దళితులకు స్వేచ్ఛ కరవు**
**పూరన్ కుటుంబ సభ్యులకు రాహుల్ పరామర్శ**



హరియాణాలోని సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్యకు కారణమైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పూరన్ కుమార్ కుటుంబాన్ని కలిశారు. ఈ సందర్భంగా పూరన్‌కు నివాళులర్పించిన ఆయన.. బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు. అనంతరం రాహుల్ విలేకరులతో మాట్లాడుతూ..ప్రభుత్వాధికారిపై ఇలాంటి వివక్ష చోటుచేసుకోవడం విషాదకరమన్నారు.

2లో..

## జూబ్లీహిల్స్ లో బిఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదు

### మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరిక




హైదరాబాద్,అక్టోబర్14(ఆర్ఎన్ఎ): జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో భారత రాష్ట్ర సమితి గూబ గుయ్యిమనేట్లు ఓటర్లు తీర్పు ఇవ్వబోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ ఉప ఎన్నికలో ఆ పార్టీ చిరునామా గల్లంతవుతుందని జోస్యం చెప్పారు. పదేళ్లలో ఆ పార్టీ పాలనలో జూబ్లీహిల్స్‌లో ఏం అభివృద్ధి జరిగిందో చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని ఓడగొట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో సున్నా సీట్లు ఇచ్చారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బుద్ధి చెప్పారు. జూబ్లీహిల్స్‌లో దొంగ ఓట్ల నమోదుకు భారత రాష్ట్ర సమితి, భాజపాలదే బాధ్యతని అన్నారు. మాగంటి సునీతతో కన్నీరు పెట్టిస్తూ.. గులాబీ పార్టీ ఓట్లు దండుకోవాలని చూస్తోందని పొన్నం విమర్శించారు.ఈ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గట్టి బుద్ధి చెప్పబోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. గత పదేళ్లుగా ఆ పార్టీ పాలనలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి పరంగా ఏ మాత్రం ముందుకు సాగలేదని, ఇప్పుడు ప్రజలే ఆ విఫలతకు తీర్పు ఇవ్వబోతున్నారని అన్నారు. పదేళ్ల పాలనలో అభివృద్ధి పేరుతో ఒక్క రోడ్డు సరిచేయలేని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు ఓట్ల కోసం నటన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే ఆ పార్టీకి గట్టి షాక్ ఇచ్చారని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలకూ ప్రజలు సరైన పాఠం చెప్పబోతున్నారని ఆయన స్పష్టం చేశారు. ఈసారి ఓటర్లు మోసపోవడం లేదని తీవ్ర విమర్శలు గుప్పించారు.

## రిజర్వేషన్లు బీసీల హక్కు..

### దయా దాక్షిణ్యాల మీద ఇచ్చేవి కాదు: కోదండరాం



హైదరాబాద్: రిజర్వేషన్లు బీసీల హక్కు అని, దయా దాక్షిణ్యాల మీద ఇచ్చేవి కాదని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం అన్నారు. సమానత్వపు పునాదులపై కొత్త సమాజం ఏర్పాటు చేసేందుకే అవి ఉన్నట్లు చెప్పారు.

## మంత్రి కొండా సురేఖ ఓఎస్డీ తొలగింపు




హైదరాబాద్: మంత్రి కొండా సురేఖ ఓఎస్డీ ఎన్. సుమంత్‌ను తొలగిస్తూ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) ఉత్తర్వులు జారీ చేసింది. కాలుష్య నియంత్రణ బోర్డులో సుమంత్ ఒప్పంద ఉద్యోగిగా ఉన్నారు. పరిపాలన కారణాలతో సుమంత్‌ను తొలగిస్తున్నట్లు పీసీబీ వెల్లడించింది.

## తుమ్మల, పొన్నంలకు మానవత్వం ఉందా

**మాగంటి సునీతను అవమాన పరుస్తారా**
**మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాస గౌడ్**



మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లకు మానవత్వం ఉందా? వాళ్లు మనుషులేనా? అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. ఆడబిడ్డ అయిన మాగంటి సునీతను అవమానించడం ఎంతవరకు సమంజసం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ..

2లో..

## విశాఖలో గూగుల్ ఏఐ హబ్ ఓ మైలురాయి

### మోదీకి సుందర్ పిచాయ్ ఫోన్

విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. గూగుల్ మధ్య చారిత్రక ఒప్పందం జరిగింది. ఈసందర్భంగా టెక్ దిగ్గజం గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్.. భారత ప్రధాని నరేంద్రమోదీ తో ఫోన్‌లో మాట్లాడారు. తమ కంపెనీ తొలి ఏఐ హబ్ విశేషాలను ప్రధానితో పంచుకున్నారు. ఈ విషయాన్ని సుందర్ పిచాయ్ తన 'ఎక్స్' పోస్ట్‌లో వెల్లడించారు.

2లో..



ప్రధాని మోదీతో సుందర్ పిచాయ్ (పాత చిత్రం)

## కారు అద్దాలు పగలగొట్టి రూ.20 లక్షలు ఎత్తుకెళ్లిన దుండగులు



2లో..

సంగారెడ్డి: కారు అద్దాలు పగలగొట్టి అందులో ఉన్న రూ. 20 లక్షల నగదును దుండగులు ఎత్తుకెళ్లారు.

## సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో గంజాయి చాక్లెట్లు



2లో..

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం అక్టోబరు 15 2025

# సర్వనాశనం రాగంగా శాంతిగీతం

ఏకపక్ష ప్రేమలూ, ఏకపక్ష యుద్ధాలూ, ఏకపక్ష శాంతి ఒప్పందాల్లేని దేశ చరిత్రలు లేవు! కనీస న్యాయం కావాలని ఘోషించే వారే తరచూ వీటికి బాధితులుగా కనపడతారు. ఇక కనీవినీ ఎరుగని జీవన విధ్వంసానికి సాక్షులుగా నిలిచిన వారికి నోరెత్తే పరిస్థితీ ఉండదు. గాజాలో ఇప్పుడదే జరుగుతోంది. తాము ప్రతిపాదించిన బలవంతపు శాంతి ఒప్పందానికి అంగీకరించకపోతే సర్వనాశనాన్నే చూస్తారనే హెచ్చరికలు అగ్రరాజ్య అధినేత ట్రంప్ నుంచి రావటంతో హమాస్‌కు వేరే దారి కనపడటం లేదు. హమాస్ పూర్తిగా దిగి రావచ్చు. పాదాక్రాంతమూ కావచ్చు. ఇజ్రాయెల్%–% అమెరికా పెట్టిన అన్ని షరతులకూ అంగీకరించొచ్చు. కానీ హమాసే గాజా కాదు. హమాసే పాలస్తీనా కాదు. ప్రజలను ఒక సంస్థకు గుత్తాధిపత్యంగా భావించలేం. బాధిత ప్రజలకు న్యాయం దక్కటమే లక్ష్యమైతే శాంతి ప్రణాళిక ఆ దిశగా ఉండాలి. కానీ అందులో ఆ ఛాయల్లేవు. బాధితుల గొంతు అందులో లేదు. చిరకాలంగా వారు కోరుకుంటున్న న్యాయమూ లేదు. పాలస్తీనా సమస్య పరిష్కారానికి అందులో నిర్దిష్ట చర్యల్లేవు. రెండు దేశాల ఏర్పాటు వాగ్దానం ఊసేలేదు. ఇజ్రాయెల్ కోరుకున్న రీతిలో శాంతి ప్రణాళిక ఉందనే విమర్శలే ప్రధానంగా వినపడుతున్నాయి. సుంకాల యుద్ధాలతో నలిగిపోతున్న దేశాధినేతలకు.. ట్రంప్‌ను ప్రసన్నం చేసుకోటానికి శాంతి ప్రణాళిక ఒక సందర్భాన్ని సృష్టించింది. అది వేరే కథ!మొదటి, రెండో ప్రపంచ యుద్ధాల్లో సైతం పరాజితులు తమ విన్నపాలనూ బలంగానే విన్పించారు. పరాజితులు పరాభవ భారంతో మిగిలిపోకుండా, దాని ఆసరాగా ప్రజలను మళ్లీ యుద్ధోన్ముఖులను చేయకుండా ఉంచటానికి ప్రయత్నాలు జరిగాయి. రెండు ప్రపంచ యుద్ధాల్లో తలపడిన దేశాలన్నీ ఎంతోకొంత సమవుజ్జీలు కావటంతో పరాజితులు పూర్తిగా పాదాక్రాంతులు కాలేదు. లేచి నిలబడే స్వేచ్ఛను దక్కించుకున్నారు. లోగొంతుతో కొన్ని స్పష్టంగానే చెప్పారు. స్వంత మార్గంలో ముందుకు వెళ్లటానికి వెసులుబాట్లూ పొందారు. అందుకే పరాజిత దేశాలైన జర్మనీ, జపాన్‌లు పదేళ్లలోనే మళ్లీ పుంజుకుని ఆర్థికంగా కీలకంగా మారాయి. గాజా పరిస్థితి వేరు. 365 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన ఒక చిన్న ప్రాంతంలో జరిగిన బీభత్సమూ, విధ్వంసమూ ఈ శతాబ్దంలో మరెక్కడా చోటుచేసుకోలేదు. ప్రపంచంలోనే అత్యధికంగా శరణార్థులు ఉన్న చిన్న ప్రదేశం గాజా. అత్యధిక జనసాంద్రతలు కలిగిన వాటిల్లో అగ్రభాగాన ఉంది. మరణాలు, ఆస్తులు, సౌకర్యాల విధ్వంసాల గురించి ఇప్పటి వరకూ వస్తున్నవన్నీ తుది లెక్కలు కావు. ప్రాణాలు కోల్పోయిన వారు 67,000 నుంచి 84,000 మంది ఉండొచ్చనే అంచనాలు ఉన్నాయి. క్షతగాత్రులెందరో పూర్తిగా తెలియదు. అందులో పనిచేయగలిగిన వారెందరో చెప్పలేం. అనుకున్నట్లుగా శాంతి ప్రణాళిక అమలైతే, ఇజ్రాయెల్ దానికి అడ్డంకులు కల్పించకుండా ఉంటే అసలు లెక్కలు తేలతాయి. అప్పుడే యుద్ధనేరాల, కిరాతకాల సంపూర్ణస్వరూపం బయటపడుతుంది. 1948 నుంచీ ఇప్పటివరకూ అరబ్బు దేశాలతో ఇజ్రాయెల్ పరోక్ష, ప్రత్యక్ష యుద్ధాలు చాలానే చేసింది. వాటిల్లో మరణించిన వారి సంఖ్యతో పోల్చితే గాజా మృతులే ఎక్కువ. 1948 యుద్ధంలో 10 నుంచి 15 వేల వరకూ అరబ్బులు చనిపోయారు. 1967 నాటి ఆరురోజుల యుద్ధంలో 15,000 మంది మరణించారు. 1973 నాటి యుద్ధంలో 8,000 నుంచి 18,500 వరకూ మరణాలు చోటుచేసుకున్నాయి. ఏ కోణం నుంచి చూసినా గాజా యుద్ధమంత దారుణమైంది మరొకటి లేదు. అందుకే ఈ యుద్ధంతో ఇజ్రాయెల్ ప్రతిష్ఠ ఎన్నడూ లేనంతగా దిగజారిపోయింది. సామాజిక మాధ్యమాల్లో గాజా బీభత్సాల దృశ్యాలు చూసిన వారి హృదయాలు విషాదంలో బరువెక్కాయి. యువతలో ఆగ్రహాలు వెల్లువెత్తాయి. విశ్వవిద్యాలయాల్లో నిరసన ప్రదర్శనలు హోరెత్తాయి. నిరసనలకు నిలయాలైన వర్సిటీలకు అందించే ఆర్థిక సహాయానికి కత్తెరవేసే చర్యలు అమెరికాలో మొదలయ్యాయి. వియత్నాం యుద్ధసమయంలో కూడా వర్సిటీల్లో నిరసనలు జరిగాయి. ఇప్పటిలా వాటిపై కత్తికట్టలేదు. భావస్వేచ్ఛకు వీలు ఇవ్వని ఛాందస జాతీయవాదం ఎక్కడైనా చెరుపే చేస్తుందనటానికి ఇంతకంటే నిదర్శనం లేదు.పాలస్తీనా ప్రజల సమస్య పరిష్కారం అయితేనే గాజా, వెస్ట్‌బ్యాంకులో ప్రశాంతత నెలకొంటుంది. అక్కడి ప్రజలకు ఆమోదంలేని ఏ ప్రణాళికా దీన్ని సాధించలేదు. హమాస్ లాంటి తీవ్రవాద సంస్థలు కూడా ఒక దేశంగా ఇజ్రాయెల్ అస్తిత్వాన్ని అంగీకరిస్తున్నాయి. అరబ్బు దేశాలు కూడా ఇజ్రాయెల్‌తో ఒప్పందాలు చేసుకుంటున్నాయి. ఇజ్రాయెల్‌ను ఇంకా గుర్తించని దేశాలు కూడా తెరవెనుక మంతనాలు సాగిస్తున్నాయి. ఏ దృష్టితో చూసినా ఇజ్రాయెల్ అస్తిత్వానికి ఇప్పుడు ప్రమాదమే లేదు. సైనికంగా ఇజ్రాయెల్‌తో తలపడే దేశం కూడా మధ్యప్రాచ్యంలో లేదు. దుస్సాహసం చేసినా ఓటమినే చూడాల్సి వస్తుంది. అంతటి శక్తిని ఇజ్రాయెల్ సంపాదించుకుంది.

ఇటువంటి పరిస్థితుల్లో ఇజ్రాయెల్ గతంలో కంటే భిన్నంగా ముందుకొచ్చి పాలస్తీనా సమస్యను పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలి. కానీ ఒకనాటి పాలస్తీనా ప్రాంతమంతా గ్రేటర్ ఇజ్రాయెల్‌కే చెందాలనీ దైవనిర్దేశం ప్రకారం అది జరిగితీరుతుందనే మత విశ్వాసాలు గల పార్టీలపై ఆధారపడి అధికారాన్ని నెట్టుకొస్తున్న ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అందుకు సిద్ధంగా లేరు. ఆయన నాయకత్వం వహిస్తున్న లికుడ్ పార్టీకీ కూడా పాలస్తీనా స్వతంత్ర దేశంగా ఏర్పాటు కావటం ఇష్టంలేదు. పరిమిత అధికారాలతో కూడిన స్వయంపాలనను పాలస్తీనాకు ఇవ్వటానికి కూడా లికుడ్ పార్టీలో అతివాదులు అంగీకరించరు. వాదనలో సహేతుకత లేనప్పుడూ, ఏ విధంగానైనా ఐక్యరాజ్యసమితి తీర్మానాలను కాలరాయాలని అనుకున్నప్పుడూ అతివాదులకు మతమే ఆలంబనగా ఉంటుంది. బైబిల్‌లో ఇజ్రాయెల్ ప్రజలు, వారు నివసించే ప్రాంతాల ప్రస్తావన ఉంది కాబట్టి.. పాలస్తీనా వాసులందరూ వేరేచోట్లకు తరలివెళ్లాలనే వితండవాదననే అతివాదులు చేస్తారు.ఐక్యరాజ్యసమితి తీర్మానం ప్రకారం 56 శాతం భూభాగం ఇజ్రాయెల్‌కూ 43 శాతం పాలస్తీనాకూ చెందాలి. ఒకశాతం జెరూసలెం ప్రాంతాన్ని అంతర్జాతీయ పర్యవేక్షణ కింద ఉంచాలి. రెండు దేశాల రాజధానులూ జెరూసలెంలోనే ఉండాలని ఐరాస తీర్మానంలో స్పష్టంగా ఉంది. ఐరాస ప్రణాళికను యూదులు ఆమోదించారు. అరబ్బు దేశాలు దాన్ని వ్యతిరేకించి యుద్ధానికి దిగాయి. బహుశా ఇది చారిత్రక తప్పిదమే కావచ్చు! యుద్ధంలో గెలిచిన ఇజ్రాయెల్ ఎక్కువ భూభాగాన్ని తన స్వాధీనంలోకి తెచ్చుకుంది. 56 శాతం భూమి 78 శాతమైంది. 1967 నాటి యుద్ధంతో మిగతా 22 శాతాన్నీ తన అధీనంలోకి తెచ్చుకుంది. గాజా, వెస్ట్‌బ్యాంకు ప్రాంతాలు అలా వచ్చినవే. ఈ రెండు ప్రాంతాల నుంచి ఇజ్రాయెల్ వైదొలగాలనీ ఐరాస తీర్మానాలు చేసినా అమెరికా, బ్రిటన్ మద్దతుతో ఇజ్రాయెల్ వాటిని ఖాతరుచేయలేదు. గాజా, వెస్ట్‌బ్యాంక్ నుంచి వైదొలగటానికి ఇజ్రాయెల్ అంగీకరించి ఆ రెండూ ప్రాంతాలూ కలిసి స్వతంత్ర దేశంగా ఏర్పడటానికి దోహదం చేస్తే శాంతి ప్రణాళికకు అర్థం ఉంటుంది. ట్రంప్‌కు కానీ, నెతన్యాహుకు కానీ ఆ దిశగా అడుగులు వేయాలని ఏ మాత్రమూ లేదు. అందుకే 20 సూత్రాల శాంతి ప్రణాళికలో రెండు దేశాల ఏర్పాటు ప్రస్తావనకు ఎటువంటి ప్రాధాన్యం దక్కలేదు. ఎన్నో చర్చల అనంతరం కుదిరిన ఓస్లో ఒప్పందాలు (1993, 1995) విఫలమైన నేపథ్యంలో పాలస్తీనా నాయకుల ప్రమేయమే లేని 20 సూత్రాల ప్రణాళిక అనుకున్నట్లుగా అమలైతే అది పెద్ద విశేషమే అవుతుంది! హమాస్, ఇస్లామిక్ జిహాద్ సంస్థలు బలపడటానికి ఓస్లో ఒప్పందాల వైఫల్యాలే ప్రధాన కారణాలు. చరిత్ర పునరావృతమైతే హమాస్ లాంటి సంస్థలే పుట్టుకొస్తాయి. వాటివల్ల ఇజ్రాయెల్ ప్రజలకూ, పాలస్తీనా ప్రజలకూ ఎటువంటి మేలూ జరగదు.తన చుట్టూ పాలస్తీనా ఒక ముస్లిం దేశంగా ఉండటం ఇజ్రాయెల్‌కు ఇష్టంలేదు. భద్రతా కారణాల దృష్ట్యా అది సబబే అనుకుందాం! మరి చుట్టూ ఉన్న ముస్లిం దేశాల సంగతి ఏమిటి? వాటి నుంచి ప్రమాదాలు రావా? అన్న ప్రశ్నకు ఇజ్రాయెల్ వైపు సహేతుక సమాధానం కనపడదు. పాలస్తీనా స్వతంత్ర దేశంగా ఏర్పడితే దానికంటూ చరిత్రను నెమరువేసుకునే క్రమం మొదలవుతుంది. విద్యా బోధనలో భాగంగా పాలస్తీనా ఛిన్నాభిన్నమైన తీరును వివరిస్తారు. ప్రజల జ్ఞాపకాల్లో నిక్షిప్తమైన బాధలు కళారూపాల ద్వారా వెలుగులోకి వస్తాయి. చరిత్రలో ఎవరు ఎక్కడ నుంచి వచ్చారో, ఎవరు ఎవరిని లొంగదీసుకున్నారో, పరసీమలకు ప్రజలు ఎలా చెల్లాచెదురయ్యారో తెలిపే సంఘటనలన్నీ ప్రజల ముందుంచటం అనివార్యమవుతుంది. అవన్నీ కలిసి ప్రజల్లో ఒక యుక్తాయుక్త వివేచనను మేల్కొలుపుతాయి. అది ఇజ్రాయెల్‌కు అసలు సరిపడదు. కానీ చరిత్రలోని చేదునిజాలను ఎల్లకాలమూ దాయలేం! గాజాతో పాటు వెస్ట్‌బ్యాంకుని కూడా పూర్తిగా విలీనం చేసుకుని అక్కడి ప్రజలకు పూర్తిపౌరసత్వం కల్పించటానికి ఇజ్రాయెల్ ముందుకొస్తే అదొక కొత్త చరిత్ర అవుతుంది. దీంతోపాటు దేశదేశాల్లో తలదాచుకున్న పాలస్తీనా శరణార్థులందరికీ స్వదేశంలోకి ప్రవేశం కల్పించటానికి సిద్ధపడితే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయి. ఇవి జరగాలంటే ఇజ్రాయెల్ ప్రజాస్వామ్యపరంగా ఎంతో ఎదగాలి. యూదుల కోసమే ప్రత్యేక రాజ్యమన్న భావనను వీడాలి. ఒకనాటి పాలస్తీనా భూభాగంలో ఉండే ప్రజలందరికీ సమానహక్కులు కల్పించే విధంగా ఇజ్రాయెల్ రాజకీయవ్యవస్థ పరిణతి చెందాలి. ఒకప్పుడు రెండు దేశాల ఏర్పాటును సమర్థించిన మేధావులెందరో ఇప్పుడది సాధ్యంకాదనే భావనకు వస్తున్నారు. వెస్ట్‌బ్యాంకులో ఇప్పటికే 5 లక్షలకు పైగా యూదులు నివసిస్తున్నారు. ఇజ్రాయెల్‌కు ప్రాణాధారమైన నీరు అక్కడ నుంచే వస్తుంది.

# 16న తెలంగాణ క్యాబినెట్ భేటీ..

మొదటి పేజీ తరువాయి

గురువారం ( అక్టోబర్ 16 ) తెలంగాణ క్యాబినెట్ భేటీ కానుంది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ క్యాబినెట్ భేటీలో కీలకం అంశాలు చర్చకు రానున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో ప్రధానంగా బీసీ రిజర్వేషన్ల కోటా అంశంపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బీసీ రిజర్వేషన్ల కోటాపై హైకోర్టు స్టే, సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్ పై చర్చించనుంది మంత్రివర్గం. పంచాయితీ ఎన్నికలు, జీవో 9పై హైకోర్టు స్టే విధించిన క్రమంలో ఈ భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది.

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో ప్రజల్లోకి వెళ్లేందుకు ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్న అంశంపై క్యాబినెట్ భేటీలో చర్చించే అవకాశం ఉంది. బీసీ రిజర్వేషన్ల కోటాపై సుప్రీంకోర్టులో వచ్చే తీర్పును బట్టి ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్నది క్యాబినెట్ చర్చించే అవకాశం ఉంది.

దీంతో పాటు రాష్ట్రంలో వరి, పత్తి కొనుగోలు సెంటర్లకు సంబంధించిన అంశం కూడా చర్చించే అవకాశం ఉంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై కూడా క్యాబినెట్ చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పడ్డాక జరుగుతున్న రెండో ఉపఎన్నిక కావడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ జూబ్లీహిల్స్ స్థానాన్ని కైవసం చేసుకోవడంపై ఫోకస్ పెట్టింది. అంతే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల మరమ్మత్తులకు నిధుల కేటాయింపులు వంటి కీలక అంశాలు క్యాబినెట్ భేటీలో చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో గంజాయి చాక్లెట్లు

మొదటి పేజీ తరువాయి

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ లో గంజాయి చాక్లెట్లు కలకలం రేపాయి. మంగళవారం ( అక్టోబర్ 14 ) సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ లో గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. STFD టీం, సీఐ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో 1.6 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. రైల్వేస్టేషన్ లోని 10వ ప్లాట్ ఫామ్ పై అనుమానాస్పద సంచిలో గంజాయి చాక్లెట్లను గుర్తించారు పోలీసులు.

తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి అక్కడి నుంచి పారిపోవడంతో అనుమానం వచ్చిన పోలీసులు.. ప్లాట్ ఫామ్ పై ఉన్న సంచిని తెరిచి చూడగా గంజాయి చాక్లెట్లు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గంజాయి అక్రమ రవాణా వెలుగులోకి వచ్చింది.

అయితే.. గంజాయి తరలిస్తున్న కారులో మంటలు రావడంతో కారును అక్కడే వదిలేసి వెళ్లిపోయారు నిందితులు. మంగళవారం ( అక్టోబర్ 14 ) జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచలో అయ్యప్ప స్వామి గుడి దగ్గర జరిగింది ఈ ఘటన. గంజాయి తరలిస్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నడిరోడ్డుపై కారులో మంటలు చెలరేగడంతో స్థానికులు గుమిగూడారు. దీంతో భయపడ్డ నిందితులు కారు అక్కడే వదిలేసి వెళ్లిపోయారు.


# విశాఖలో గూగుల్ ఏఐ హబ్ ఓ మైలురాయి

మొదటి పేజీ తరువాయి

“విశాఖపట్నంలో గూగుల్ తొలి ఏఐ హబ్‌కు సంబంధించిన ప్రణాళికలను పంచుకునేందుకు ప్రధాని మోదీతో మాట్లాడా. ఈ ఏఐ హబ్ ఓ కీలక మైలురాయిగా నిలవనుంది. ఈ హబ్‌లో గిగావాట్ సామర్థ్యం ఉండే హైపర్ స్కేల్ డేటా సెంటర్, అంతర్జాతీయ సబ్‌సీ గేట్‌వే, భారీస్థాయిలో ఇంధన మౌలిక సదుపాయాలు ఉండనున్నాయి. ఈ హబ్‌తో అధునాతన సాంకేతికతను భారత్‌లో సంస్థలకు, వినియోగదారులకు అందించనున్నాం. కృత్రిమ మేధ ఆవిష్కరణలను మరింత వేగవంతం చేస్తాం” అని సుందర్ పిచాయ్ రాసుకొచ్చారు.

దిల్లీ వేదికగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ మధ్య మంగళవారం ఈ ఒప్పందం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఐటీ, కమ్యూనికేషన్ల శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా గూగుల్ రానున్న ఐదేళ్లలో సుమారు 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. భారత్‌లో ఈ కంపెనీకి ఇదే అతిపెద్ద పెట్టుబడి. ఈ ఒప్పందం సందర్భంగా గూగుల్ (%+శీశీస్త్రశ్రీవ%) క్లౌడ్ గ్లోబల్ సీఈవో థామస్ కురియన్ మాట్లాడుతూ.. గ్లోబల్ కనెక్టివిటీ హబ్‌గా విశాఖ మారనుందని తెలిపారు. విశాఖ నుంచి 12 దేశాలతో సబ్‌సీ-కేబుల్ విధానం ద్వారా అనుసంధానం చేస్తామని చెప్పారు.

## గ్రూప్-2 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 18న నియామక పత్రాలు




హైదరాబాద్: గ్రూప్-2 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 18న నియామకపత్రాలు ఇవ్వనున్నారు. ఈ నెల 18న సాయంత్రం శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలు ప్రదానం చేయనున్నారు. టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-2 నియామక ప్రక్రియలో 783 మంది ఎంపికయ్యారు. సాధారణ పరిపాలన, రెవెన్యూ, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, పంచాయతీరాజ్, తదితర 16శాఖల్లో వివిధ ఉద్యోగాలకు వీరిని ఎంపిక చేశారు. గ్రూప్ 2 ఉద్యోగాల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం ఏర్పాట్లపై సీఎస్ రామకృష్ణరావు సమీక్ష నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. సుమారు 30 ఏళ్ల పాటు సర్వీసులో ఉండనున్నందున.. ప్రభుత్వ ఉద్యోగం పట్ల ఉన్నత భావన కలిగేలా కార్యక్రమం నిర్వహించాలని సీఎస్ పేర్కొన్నారు. సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు వికాస్ రాజ్, బీఎండీ ఎక్కా, రిజ్వి, సందీప్ కుమార్ సుల్తానియా, లోకేష్ కుమార్, టీకే శ్రీదేవి, ఆర్.వి.కర్ణన్, ప్రియాంక, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పూరన్ ఆత్మహత్యపై సత్వర దర్యాప్తు

మొదటి పేజీ తరువాయి

ఈ కేసుకు సంబంధించి స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా విచారణ జరుపుతామని స్వయంగా హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ హామీ ఇచ్చారన్నారు. కానీ, రోజులు గడుస్తున్నా.. అది నెరవేరటం లేదని విమర్శించారు. తండ్రిని పోగొట్టుకున్న పూరన్‌కుమార్ ఇద్దరు పిల్లలు చాలా ఒత్తిడిలో ఉన్నారన్నారు. పూరన్ కుమార్ కెరీర్‌ను, ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఇతర అధికారులు సంవత్సరాలుగా వివక్ష కొనసాగిం చారని స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఇది కేవలం ఒక దళిత కుటుంబానికి సంబంధించినది కాదని, దేశంలోని కోట్లాది మంది దళితులకు సంబంధించినదని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఐపీఎస్ అధికారిపై జరిగిన వివక్ష దళితులుగా ఎంత విజయం సాధించినా.. అణచివేత తప్పదనే తప్పుడు సందేశం వారికి వెళ్లేలా చేస్తుందన్నారు. పూరన్ కుమార్ ఆత్మహత్యకు కారకులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ, సీఎంలను డిమాండ్ చేశారు. బాధిత కుటుంబంపై ఉన్న ఒత్తిడిని తొలగించాలన్నారు. ఇక, ఈ కేసుకు సంబంధించి వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న డీజీపీ శత్రుజీత్ కపూర్‌ను రాష్ట్ర ప్రభుత్వం సెలవుపై పంపించిన సంగతి తెలిసిందే. బ్యూరోక్రసీ, పోలీస్ వ్యవస్థలో కుల వివక్ష ఉందనే ఆరోపణలు మరోసారి తెరపైకి వచ్చాయి. ఆయన ఆత్మహత్యపై తక్షణం స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా దర్యాప్తు జరపాలని, ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. ఇది కేవలం ఐపీఎస్ అధికారి కుటుంబానికి సంబంధించినదని కాదని, కోట్లాది దళితుల ఆత్మ గౌరవానికి సంబంధించినదని అన్నారు. పూరన్ కుమార్ అక్టోబర్ 7న రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎనిమిది పేజీల సూసైడ్ నోట్‌లో హర్యానా డీజీపీ శత్రుజీత్ కపూర్, రోహ్‌తక్ ఎస్పీ నరేంద్ర బిజర్నియాతో సహా పలువురు పేర్లు ఆయన ప్రస్తావించారు. కుల వివక్ష, మానసిక వేధింపులు, పబ్లిక్‌లో అవమానించడం వంటి చర్యలకు వీరు పాల్పడ్డారని ఆరోపించారు.

# రిజర్వేషన్లు బీసీల హక్కు..

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రిజర్వేషన్ల సాధన కోసం ప్రొఫెసర్ పీఎల్. విశ్వేశ్వర్‌రావు నేతృత్వంలో ఒక సబ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఇతర సంఘాలతో కలిసి ఈ కమిటీ కృషి చేస్తుందన్నారు. “ రిజర్వేషన్ల అంశంపై కొన్ని పార్టీలు ద్వంద వైఖరి అవలంబిస్తున్నాయి. కేసులు వేసిన వ్యక్తులకు మద్దతు తెలుపుతూ.. బీసీలకు అన్యాయం జరిగిందని ప్రచారం చేస్తున్నాయి. తెజసకి రెండు నాలుకల ధోరణి లేదు. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు తెలుపుతుంది. కేంద్రంపైన ఒత్తిడి తీసుకొచ్చి బీసీ బిల్లును ఆమోదించేందుకే మా పోరాటం” అని అన్నారు.

బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ర్యాలీలు, సమావేశాలు, ధర్నాలు నిర్వహిస్తామని తెజస ఉపాధ్యక్షుడు పీఎల్. విశ్వేశ్వర్‌రావు అన్నారు. సుప్రీం కోర్టులో న్యాయపరంగా పోరాటం చేస్తామన్నారు. 16న గవర్నర్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్లపై తెజస పలు తీర్మానాలు చేసింది. బీసీ సంఘాలు 18న నిర్వహించే బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించింది. మరోవైపు బీసీ రిజర్వేషన్లపై కోర్టు స్టే ఇవ్వడంలో న్యాయం లేదని ఎంపీ, బీసీ రిజర్వేషన్ల సాధన సమితి కన్వీనర్ ఆర్. కృష్ణయ్య తెలిపారు. స్టే ఇవ్వడం ద్వారా బీసీల నోటికాడ ముద్దను లాక్కుందని వ్యాఖ్యానించారు. బీసీల వాదన వినకుండా కోర్టు ఏకపక్షంగా స్టే ఇచ్చిందన్నారు.

# తుమ్మల, పొన్నంలకు మానవత్వం ఉందా

మొదటి పేజీ తరువాయి

మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గోపన్న అమర్ రహే అంటుంటే, తన భర్త గోపినాథ్‌ను గుర్తు చేసుకొని మాగంటి సునీత ఏడుస్తుంటే డ్రామా అంటారా తుమ్మల నాగేశ్వరరావు? కమ్మ సామాజిక వర్గం ఓటు వేస్తే గెలిచిన తుమ్మల, అదే వర్గానికి చెందిన నేత గోపినాథ్ సతీమణిని డ్రామా అంటారా? అని ప్రశ్నించారు. మాగంటి సునీతకు మంత్రుల వ్యాఖ్యలు తీవ్ర మనస్తాపం కలిగించాయని, వారు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రుల మాటలను తెలంగాణ ఆడబిడ్డలు గమనించాలి అని ఆయన వ్యాఖ్యానించారు.

యువకుడు..అలాగే, ప్రెస్ మీట్ సమయంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి మంత్రుల పక్కనే కూర్చున్నా, ఆడబిడ్డ అవమానింపబడుతుండగా మౌనంగా ఉన్నారని గౌడ్ విమర్శించారు. రాజీవ్ గాంధీ చనిపోయినప్పుడు పార్టీలకతీతంగా అందరం బాధ పడ్డామని, ఇప్పుడు మాగంటి సునీత తన భర్తను గుర్తుచేసుకొని ఏడుస్తుంటే దాన్ని డ్రామా అంటారా? ఇది సిగ్గుచేటు అని మండిపడ్డారు. మాగంటి సునీత భావాలను దెబ్బతీసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లు వెంటనే క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.

# కారు అద్దాలు పగలగొట్టి రూ.20 లక్షలు ఎత్తుకెళ్లిన దుండగులు

మొదటి పేజీ తరువాయి

ఈ ఘటన సంగారెడ్డిలో జరిగింది. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ముజాఫీర్ సంగారెడ్డిలో ఇల్లు విక్రయించారు. రూ.20 లక్షల నగదును కారులో పెట్టుకుని రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి బయల్దేరారు. సంగారెడ్డిలోని క్లాసిక్ గార్డెన్ వద్ద బంధువుల ఇంటిముందు కారు ఆపి.. ముజాఫీర్ లోపలికి వెళ్లారు. ఈ క్రమంలో ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు కారు అద్దాలు పగులగొట్టి.. రూ.20 లక్షలు అపహరించారు.

# పోలవరం- బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రానికి తెలంగాణ లేఖ

పోలవరం- బనకచర్ల లింకు ప్రాజెక్టు విషయంలో ఏపీ ప్రభుత్వాన్ని నిలువరించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా లేఖ రాశారు. బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో గతంలోనే ఫిర్యాదు చేసినట్లు లేఖలో గుర్తు చేశారు. డీపీఆర్ తయారీ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగించే, నిబంధనలు, విభజన చట్టానికి వ్యతిరేకంగా బనకచర్ల లింక్ ప్రాజెక్టు చేపట్టకుండా చూడాలని కోరారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్ర జలసంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, గోదావరి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డులకు లేఖ రాసింది. తాజాగా కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. పోలవరం - బనకచర్ల విషయంలో ఏపీ ముందుకెళ్లకుండా నిలువరించాలని కోరారు. టెండర్, భూసేకరణ విషయంలో ముందుకెళ్లకుండా చూడాలని కోరారు.

# బీసీల హక్కుల పరిరక్షణ
## - మెటుపల్లి బంద్ కు పిలుపు



**కరపత్రం మెటుపల్లి**
జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలో మంగళవారం, బీసీల హక్కుల పరిరక్షణ కోసం ఈనెల 18న బంధ్‌కు మెట్ పల్లి పట్టణ బీసీ సంక్షేమ సంఘం పిలుపునిచ్చింది. మెట్పల్లి డివిజన్ అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్, మండల అధ్యక్షులు దేవేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో, స్థానిక సంస్థల ఎన్నికల కోసం రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై బీసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ బంధ్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఖాతాదారుడి భార్యకు బీమా చెక్కు అందజేత

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని ఎస్బీఐ బ్యాంకులో ఖాతాదారుడైన టీజీఎస్ఎన్పీడీసీఎల్ ఉద్యోగి రంగు రవీందర్ ఆరు నెలల క్రితం మరణించడంతో, ఆయన భార్యకు బ్యాంకు మేనేజర్ పి. నవీన్, కరెంట్ డిపార్ట్మెంట్ ఎస్సీడీఈఈ చేతుల మీదుగా రూ. 10 లక్షల బీమా చెక్కును అందజేశారు. ఎస్బీఐ, టీజీఎస్ఎన్పీడీసీఎల్ మధ్య 2025 ఫిబ్రవరి 18న శాలరీ ప్యాకేజీ అకౌంట్ ఒప్పందం జరిగిందని బ్యాంకు మేనేజర్ తెలిపారు.

## కోరుట్ల ప్రభుత్వ కళాశాలకు పుస్తకాలు అందజేత



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల**
జగిత్యాల జిల్లా కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యూ ఢిల్లీకి చెందిన సుల్తాన్ చాంద్ ట్రస్ట్ వారు 3,87,494 రూపాయల విలువైన 954 పుస్తకాలను ఉచితంగా అందించారు. కామర్స్, బిజినెస్ మేనేజ్ మెంట్, కెమిస్ట్రీ, హిందీ, జియాలజీ, జియోగ్రఫీ, ఎన్విరాన్మెంటల్ వంటి ప్రధానాంశాలకు సంబంధించిన ఈ పుస్తకాలు ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అందించబడ్డాయి. కళాశాల ప్రిన్సిపల్ నడి కట్ల సందీప్ విద్యార్థులు ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. ట్రస్ట్ చైర్మన్ G.D. చౌదరి, ట్రస్టీ P.N. శ్రీకాంత్ లకు కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులు లక్ష్య సాధన దిశగా కృషి చేయాలి
## - ఆర్డీఓ నక్క శ్రీనివాస్



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
మంగళవారం జగిత్యాల జిల్లా మెట్ పల్లిలోని మనోహర్ గార్డెన్ లో జ్ఞానోదయ డిగ్రీ, పీజీ కళాశాల నూతన విద్యార్థుల స్వాగతోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మెట్ పల్లి రెవెన్యూ డివిజన్ అధికారి నక్క శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన దిశగా కృషి చేయాలని సూచించారు. కరస్పాండెంట్ ఇల్లేందుల శ్రీనివాస్, సమయపాలన పాటిస్తూ చదువుకుని సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

## వరిలో సస్య రక్షణకు సలహాలు
## - వ్యవసాయ అధికారి రాజ్ కుమార్



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం వ్యవసాయ శాఖ అధికారి రాజ్ కుమార్ మంగళవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో వరి పొలాలను పరిశీలించారు. ఆలస్యంగా నాట్లు వేసుకున్న పొలాలలో ఎండు తెగులును గమనించి, నివారణకు ప్లాంటోమైసిన్ ప్లస్ కాపర్ ఆక్సీ క్లోరైడ్ మందును ఎకరానికి 500 గ్రాములు పిచికారీ చేయాలని సూచించారు. పలుపొసుకునే దశలో కంకి నల్లి, కాటుక తెగులు నివారణకు స్పైరొమెసిఫ్ 200 ml ం ప్రొపైకానాజోలు 100 %ఎశ్రీ% ఎకరానికి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి
## - మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కేఎల్ఆర్ వెంచర్ కాలనీలో మంగళవారం డీసీపీ కోటిరెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్మెట్, లైసెన్స్, ఆర్సీ తనిఖీలు నిర్వహించారు. 86 వాహనాలను తనిఖీ చేయగా, సరైన పత్రాలు లేని 30 మందిపై కేసులు నమోదు చేసి, రూ. 19వేల పెండింగ్ చలాన్లను వసూలు చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలను తప్పక పాటించాలని డీసీపీ కోటిరెడ్డి సూచించారు.

## చర్లపల్లి అభివృద్ధికి హామీ
## - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చర్లపల్లి డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. మేడ్చల్ జిల్లాలోని చర్లపల్లి డివిజన్ పరిధిలోని సాయి నగర్, ఛక్రిపురం, రామ కృష్ణ నగర్, డబుల్ బెడ్ రూం, లక్ష్మి నగర్, డీసీ కాలనీ, చర్చి కాలనీ, పెద్ద చర్లపల్లి, శ్రీ సాయి గణేష్ నగర్, ఈసీ నగర్, బీఎన్ రెడ్డి నగర్ వంటి పలు కాలనీల్లో మంజూరైన పనులను ఆయన స్థానిక నాయకులు, కాలనీ వాసులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం విద్యార్థికి బ్లాక్ బెల్ట్ డిప్లొమా
## - హీరో సుమన్ చే ప్రధానం



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
హైదరాబాద్‌లోని నాగబాబు స్టూడియోలో, జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ప్రధాన శిక్షకులు రాపోలు సుదర్శన్ ఆధ్వర్యంలో, 14.10.2025 మంగళవారం అంతర్జాతీయ, జాతీయ బ్లాక్ బెల్ట్ ప్రశంసా పత్రాల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సినీ నటుడు, జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ లెజెండ్ దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత సుమన్, జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన కరాటే విద్యార్థి రాగి హర్షవర్ధన్ కు జాతీయ స్థాయి బ్లాక్ బెల్ట్ డిప్లొమా ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు.

## అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వ్యక్తిపై కేసు, రిమాండ్
## - చందుర్తి ఎస్సై జె.రమేష్

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మామిడిపల్లి గ్రామానికి చెందిన పత్రి పవన్ పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి ఎస్సై జె. రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం ఏఎస్ఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో కలిసి కిష్టంపేట గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్ కంటపడిందని, పోలీసులను చూడగానే డ్రైవర్‌తో పాటు యజమాని ట్రాక్టర్‌ను అక్కడే వదిలేసి పారిపోయారని, వెంటనే పోలీసులు పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి, ఇసుకతో పాటు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించామని, అనంతరం విచారణ చేపట్టి, పరారైన యజమాని పత్రి పవన్ గా గుర్తించి అరెస్టు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై జె. రమేష్ పేర్కొన్నారు.

## రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో పదసంచలనం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట అక్టోబర్ 14**
రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా జమ్మికుంట ఖండ ఆధ్వర్యంలో శ్రీ సరస్వతి శిశు మందిర్ నుండి పురవీధుల గుండా స్వయం సేవకులు కవాతు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఖండ కార్యవాహ దాసరి రవీందర్, ముఖ్య అతిథి డాక్టర్ ముక్క రాజేశ్వరయ్య, ప్రధానవక్త దేవుని మురళిలు హాజరయ్యారు.జమ్మికుంట పట్టణ ప్రజలు మంగళహారతులు, పువ్వులతో స్వాగతం పలికారు. అనంతరం ముఖ్య అతిథులు, స్థానిక ప్రజలు మాట్లాడుతూ... హిందూ ధర్మ స్థాపనకై పనిచేస్తున్న ఆర్ఎస్ఎస్ ప్రపంచ దేశాల లో ముందు ఉందని కొనియాడారు. ఈ పద సంచాలనలో
200 మంది స్వయం సేవకులు పాల్గొన్నారు .

# పత్తి క్షేత్ర ప్రదర్శన



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 14**
నాథ్ బయో జీన్స్ ఇండియా లి. నూతన పత్తి రకం నాథ్ సంకేత్ బీజి 2 ఫీల్డ్ కొత్తపల్లి రెడ్డి రామయ్య పల్లె గ్రామంలో ఒగ్గరి జగన్ అనే రైతు చేనులో పత్తి మెగాఫిల్డ్ డే ప్రదక్షణ కేంద్రాన్ని నాథ్ బయో జీన్స్ ఇండియా లి. కంపెనీ ఏర్పాటు చేశారు . నాథ్ సంకేత్ ఎక్కువ దిగుబడినిచ్చే హైబ్రిడ్ రకం , రసం పీల్చే పురుగులను సమర్థవంతంగా తట్టుకుంటుందనీ ,పత్తి తీయుట సులభంగా ఉంటుందనీ ,ప్రస్తుత కాలంలో తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడిని ఇచ్చే హైబ్రిడ్ రకం నాథ్ సంకేత్ అని కంపెనీ ప్రతినిధులు తెలిపినారు.శివ ప్రసాద్ రావు ఏజీఎ%శీ% నాంపల్లి,తిరుపతి డి. ఆర్. ఎం , డిస్ట్రిబ్యూటర్ దుర్గాదేవి ట్రేడర్స్ సురేష్ బాబు , ఆశిష్ ,
డీలర్స్ కార్తికేయ ఎంటర్ప్రైజెస్,శ్రీ రాజరాజేశ్వర ఎంటర్ప్రైజెస్, కంపెనీ ఎన్ .ఎఫ్ .ఏ మహేందర్ , జీవన్ వెలిచాల , దేశరాజు పల్లి , కొత్తపల్లి గ్రామాల ప్రజలు సుమారు 240 మంది పాల్గొనడం జరిగింది అని తెలిపారు.?

## బీజేపీ నాయకులపై పోలీస్ లకు పిర్యాదు..



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట అక్టోబర్ 14**
హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపి నాయకులపై టీఆర్ఎస్ నాయకులు పోలీస్ స్టేషన్ లో మంగళవారం పిర్యాదు చేశారు. అనంతరం సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్, మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వర్ రావులు మాట్లాడుతూ నియోజక వర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న కౌశిక్ రెడ్డిపై అవాకులు, చెవాకులు పేలితే సహించేది లేదన్నారు. ప్రజల్లో ఎమ్మెల్యేకు ఉన్న ఆదరణ చూసి ఓర్వలేకనే బీజేపీ నాయకులు విమర్శలు చేస్తున్నారన్నారు. మరో మారు తమ నాయకుడిపై ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో చిలుముల రామస్వామి, ఎండి జానీ, మొలుగూరి వసంత్, మంద రాజేష్, జే కే పొనగంటి శ్రీధర్ సందీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన ఒక వ్యక్తి మూడు రోజుల జైలు శిక్ష



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని అక్టోబర్ 14:**
రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో డ్రంక్ & డ్రైవ్ లో పట్టుబడిన 25 మందిని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ గోదావరిఖని వెంకటేష్ దుర్వ ముందు హాజరుపరీచారు. 24 మందికి రూ.48 వేల జరిమానా విధించారు. ఆటో డ్రైవర్ గా పనిచేస్తున్న వ్యక్తి రెండవసారి పట్టుబడగా మూడు రోజుల జైలు శిక్ష విధించగా.. కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు.

## జర్నలిస్టులూ...సమిష్టిగా ఉండండి
## - సమస్యలపై పోరాడండి

- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య



**కరపత్రం ప్రతినిధి తుంగతుర్తి, అక్టోబర్ 14:**
తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సభ్యులంతా సమన్వయంతో సమిష్టిగా ఉండాలని,జర్నలిస్టుల సమస్యలపై పోరాడాలని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పిలుపునిచ్చారు.టీడబ్ల్యూజేఎఫ్ సూర్యాపేట జిల్లా సంయుక్త కార్యదర్శి వంగాల వెంకన్న ఆహ్వానం మేరకు రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, వల్లాల జగన్, బండి విజయ్ కుమార్ తదితరులు మంగళవారం తుంగతుర్తిలో జరిగిన సమావేశానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, సూర్యాపేట జిల్లా కమిటీలలో ఉన్న బాధ్యులు,సభ్యులు యూనియన్ నియమ నిబంధనలకు లోబడి పని చేయాలని, అదే విధంగా బాధ్యతతో వ్యవరించి స్థానిక జర్నలిస్టుల సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. అందరు ఐక్యతతో హక్కుల సాధనకు కృషి చేయాలని కోరారు. వృత్తిలో నైపుణ్యతను, పనిలో పట్టుదలను పెంపొందించుకొని, క్రమశిక్షణతో కర్తవ్యాలను నెరవేర్చి సంఘం ప్రతిష్టలను పెంచాలని ఆయన కోరారు. సంఘం బాధ్యులెవరైనా సరే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ,తప్పులు చేసి సంఘం పరువుతీస్తే ఉపేక్షించేది లేదని, అలాంటి వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గుండగాని జమున,తదితరులు పాల్గొన్నారు

# క్యూనెట్ స్కామ్‌లో డబ్బు పోగొట్టుకుని..
# యువకుడు ఆత్మహత్య.. ఇద్దరు అరెస్ట్..

**కరపత్రం ప్రతినిధి సిద్దిపేట జిల్లా అక్టోబర్ 14**
వివాదాస్పద (QNET) క్యూనెట్ నెట్‌వర్క్‌తో ముడిపడి ఉన్న ఆన్‌లైన్ పెట్టుబడి స్కామ్‌లో లక్షల రూపాయలు పోగొట్టుకున్న సిద్దిపేట జిల్లాకు చెందిన 26 ఏళ్ల యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు.
భారతీయ న్యాయ సంహిత (BNS), ప్రైజ్ చిట్స్ మరియు మనీ సర్క్యులేషన్ స్కీమ్స్ (నిషేధం) చట్టం, 1978లోని బహుళ సెక్షన్ల కింద ఆత్మహత్యకు ప్రేరేపించడం, అక్రమ డబ్బు చెలామణికి పాల్పడినందుకు ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు.




### బాధితుడిని వెల్లూరు వాసిగా గుర్తించారు

వర్గల్ మండలం వెల్లూరు గ్రామానికి చెందిన హరికృష్ణ అనే వ్యక్తిని తక్కువ పెట్టుబడులపై అత్యున్నత రాబడి ఇస్తానని హామీ ఇచ్చి క్యూనెట్ నెట్‌వర్క్‌లోకి ఆకర్షించారని పోలీసుల దర్యాప్తులో వెల్లడైందని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్ఎం విజయ్ కుమార్ తెలిపారు.
హరికృష్ణ తండ్రి బడుగు నాగరాజు (57), తన కుమారుడు క్యూనెట్, ఇతర ఆన్‌లైన్ గేమ్‌లలో పెట్టుబడి పెట్టడానికి డబ్బు అప్పుగా తీసుకున్నాడని, చివరికి దాదాపు రూ.8 లక్షలు పోగొట్టుకున్నాడని ఫిర్యాదు చేశారు. ఆర్థిక ఒత్తిడి, మానసిక క్షోభను భరించలేక, హరికృష్ణ 2025 అక్టోబర్ 9న మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో సూసైడ్ నోట్ రాసి తన నివాసంలో ఉరి వేసుకున్నట్లు సమాచారం.

### క్యూనెట్ స్కామ్ బాధితుడిని ఎలా ఆకర్షించింది

వెల్లూరుకు చెందిన కల్వల మణికంఠరెడ్డి (23), మెదక్ జిల్లా చెట్ల గౌరారం గ్రామానికి చెందిన ఉప్పలపు అలేఖ్య (25) అనే ఇద్దరు స్థానికులు హరికృష్ణకు ఈ స్కీమ్‌ను పరిచయం చేసినట్లు పోలీసులు విచారణలో గుర్తించారు.
క్యూనెట్ లో డబ్బు పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయని వారు అతనిని ఒప్పించారని పోలీసులు తెలిపారు. జూలై 2025లో, సికింద్రాబాద్‌లోని ట్యాంక్ బండ్ ఎదురుగా ఉన్న హోటల్‌లో నిందితులు ఏర్పాటు చేసిన సమావేశానికి హరికృష్ణ హాజరయ్యారు, అక్కడ ఆయన సభ్యత్వం కోసం ?4 లక్షలు చెల్లించారు.
ప్రతిగా, అతను పదేళ్ల పాటు చెల్లుబాటు అయ్యే 'ట్రిప్ సేవర్' కూపన్, 'బిజినెస్ ప్రమోషన్' అని పిలవబడే దానిలో భాగంగా ఒక చేతి గడియారాన్ని అందుకున్నాడు. తరువాత, అతను నిందితుడితో కలిసి హైదరాబాద్‌లో జరిగిన అనేక సెమినార్లకు హాజరయ్యాడు, అక్కడ వ్యాపార%శీ% క్యూనెట్ యొక్క భారతీయ అసోసియేట్ అయిన విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా నిర్వహించబడుతుందని అతనికి చెప్పబడింది.
అయితే, ఆ స్కీమ్ ప్రొడక్ట్ ఆధారిత వ్యాపారంలాగా మారువేషంలో ఉన్న పిరమిడ్ తరహా డబ్బు ప్రసరణ ఆపరేషన్ అని హరికృష్ణ తరువాత గ్రహించాడు. ఇతరులను నియమించకుండా నిజమైన అమ్మకాలు లేదా రాబడి అసాధ్యమని అతను అర్థం చేసుకున్నప్పుడు, అతను నిరాశకు గురయ్యాడని నివేదించబడింది.

### నిందితుడిపై పోలీసులు గాలింపు చర్యలు

పోలీసులు మణికంఠ రెడ్డి, అలేఖ్య ఇద్దరినీ అరెస్టు చేశారు, వారిని జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఈ రాకెట్‌లో ప్రమేయం ఉన్న ఇతర సభ్యులను గుర్తించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కమిషనర్ విజయ్ కుమార్ తెలిపారు.క్యూనెట్ఇలాంటి డబ్బు ప్రసరణ పథకాలు పూర్తిగా మోసపూరితమైనవి. అవి లాభాలను వాగ్దానం చేస్తాయి కానీ నష్టాలు, నిరాశను కలిగిస్తాయి" అని కమిషనర్ అన్నారు. వ్యాపార పెట్టుబడుల ముసుగులో నిందితులు వ్యక్తుల నుండి పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసి ఆన్‌లైన్ మార్గాల ద్వారా వాటిని మళ్లిస్తున్నారని ఆయన నిర్ధారించారు.

### పౌరులకు కమిషనర్ తీవ్ర హెచ్చరిక

ఆన్‌లైన్ బెట్టింగ్, పెట్టుబడి యాప్‌లు లేదా త్వరగా ధనవంతులయ్యే పథకాల బారిన పడవద్దని పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్ ప్రజలను కోరారు. "%ుచీజు% వంటి మనీ సర్క్యులేషన్ నెట్‌వర్క్‌లు ఉచ్చులు తప్ప మరొకటి కాదు. ఇందులో నిజమైన ఉత్పత్తి లేదా ఉత్పాదకత ఉండదు. ఇటువంటి పథకాలు 1978 నుండి నిషేధించబడ్డాయి, అయినప్పటికీ ప్రజలను మోసం చేస్తూనే ఉన్నాయి" అని ఆయన హెచ్చరించారు.
క్యూనెట్ ని "ఆర్థిక మహమ్మారిగా" అభివర్ణించిన కమిషనర్, అటువంటి ప్లాట్‌ఫామ్‌లను సమర్థించే ప్రముఖులు కూడా చట్టపరమైన చర్యల నుండి మినహాయించబడరని హెచ్చరించారు. సైబర్ మోసాల పట్ల పౌరులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే సైబర్ హెల్ప్‌లైన్ 1930, డయల్ 100 లేదా సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూమ్: 8712667100 కు సంప్రదించాలని ఆయన సూచించారు.

## రాష్ట్ర డీజీపీ ని కలిసిన టీఎస్ పిహెచ్ సి పూర్వపు చైర్మన్ కోలేటి దామోదర్.



**హైదరాబాద్ అక్టోబర్ 14 కరపత్రం ప్రతినిధి**
హైదరాబాదులోని పోలీస్ హెడ్ క్వార్టర్లో శివధర్ రెడ్డి ఐపీఎస్ గారిని ఇటీవల తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా నియమించబడ్డ సందర్భంగా వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభా కాంక్షలు తెలియ జేసిన తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పూర్వపు చైర్మన్ కోలేటి దామోదర్.

## మద్యం మత్తులో తీసుకున్న ఒక్క నిర్ణయానికి నాలుగు ప్రాణాలు బలి



**కడప జిల్లా శంకరాపురం అక్టోబర్ 14 కరపత్రం ప్రతినిధి**
మద్యం మత్తులో తీసుకున్న ఒక్క నిర్ణయానికి నాలుగు ప్రాణాలు బలి గూడ్స్ ట్రైన్ కింద పడి కుటుంబం మొత్తం బలవన్మరణం కడప జిల్లా శంకరాపురానికి చెందిన శ్రీరాములు(27), రవళి(23) భార్యాభర్తలు.. వీరి కుమారుడు రిత్విక్(16 నెలలు) శ్రీరాములుకు అప్పుడప్పుడు మద్యం తాగే అలవాటు.. ఇదే క్రమంలో ఆదివారం రాత్రి మద్యం తాగి వెళ్లి, కుటుంబసభ్యులతో గొడవపడ్డ శ్రీరాములు ఇదే కోపంలో భార్య, కొడుకును ఆటోలో తీసుకెళ్లిన శ్రీరాములు.. కడప రైల్వే స్టేషన్ సమీపంలోని మూడో నెంబర్ ట్రాక్ పై గూడ్స్ రైలు కింద పడి బలవన్మరణం విషయం తెలిసి గుండెపోటుకు గురై మృతి చెందిన శ్రీరాములు నానమ్మ వెంకట సుబ్బమ్మ(71)

## డిజిటల్ చెల్లింపుల రంగంపై దృష్టి.. పీఓఎస్ డివైజ్‌లను లాంచ్ చేసిన జోహో..!!

**ఇండియా న్యూస్ అక్టోబర్ 14 కరపత్రం ప్రతినిధి**
మెసేజింగ్ యాప్ వాట్సాప్‌కు సవాలు విసురుతున్న జోహో సంస్థ.. ఫిన్ టెక్ రంగంపై కూడా తన పట్టుబిగించేందుకు ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో తాజాగా పీఓఎస్ డివైజ్‌లను లాంచ్ చేసింది. త్వరలో వీటిని అరట్టై యాప్‌తో కూడా లింక్ చేస్తామని తెలిపింది. డిజిటల్ చెల్లింపుల రంగంలో పాతుకుపోయిన ఫోన్ పే, జీపే, పేటీఎమ్‌కు సవాలు విసిరేందుకు అరట్టై రూపకర్త, జోహో కార్పొరేషన్ వ్యవస్థాపకులు శ్రీధర్ వెంబు సిద్ధమయ్యారు.ఆయన సారథ్యంలోని జోహో తాజాగా పాయింట్ ఆఫ్ సేల్ డివైజ్‌లను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టింది. వీటి సాయంతో వ్యాపారులు కస్టమర్ల నుంచి నేరుగా చెల్లింపులు స్వీకరించగలుగుతారు. తన సాఫ్ట్‌వేర్ ఎకోసిస్టమ్‌తో ఈ డివైజెస్‌ను ఏకం చేయాలనే వ్యూహంతో సంస్థ ముందుకెళుతోంది.దేశీ యాప్ అరట్టైతో జోహో పే చెల్లింపుల వ్యవస్థను త్వరలో అనుసంధానం చేస్తామని శ్రీధర్ వెంబు తెలిపారు..!!




## సివిల్ వివాదాల్లో పోలీసులు తల దూర్చవద్దు..

**– గీత దాటితే వేటు తప్పదు: డీజీపీ శివధర్ రెడ్డి**



**తెలంగాణ ప్రతినిధి అక్టోబర్ 14 కరపత్రం ప్రతినిధి**
సివిల్ వివాదాల్లో పోలీసులు తలదూర్చవద్దని, సివిల్ వివాదాలను పరిష్కరించిన పోలీసు స్టేషన్లు, సంబంధిత అధికారులపై తక్షణమే వేటు పడుతుందని తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోం గార్డు నుంచి ఐపీఎస్ అధికారి వరకూ ఎవరూ సివిల్ వివాదాల్లో తల దూర్చవద్దని కోరుతూ రాష్ట్ర పోలీసులనుద్దేశించి రాసిన అంతర్గత లేఖలో శివధర్ రెడ్డి పేర్కొన్నారు. సివిల్ వివాదాలు సివిల్ కోర్టుల పరిధిలోకి వస్తాయన్న సంగతి ప్రతి పోలీసుకూ తెలుసునని, అయినా వాటిపై దృష్టి సారించే అధికారు లపై కఠిన చర్యలు తప్పవని తేల్చి చెప్పారు. పోలీసు యూనిఫామ్, అవినీతి కలిసి ఉండకూడదన్న డీజీపీ.. అవి నీతి, అక్రమాలపై కేసులు నమోదు చేసి న్యాయస్థానం ముందు నిలబెట్టాల్సిన పోలీసులే అవినీతికి పాల్పడితే ప్రజల్లో నమ్మకం పోతుందని చెప్పారు..

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి....


**– గజ్వేల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్–**



**గజ్వేల్ అక్టోబర్ 14, కరపత్రం ప్రతినిది**
అనేక కష్టాల నడుమ ఆరుగాలం శ్రమించి పండించిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేసే కేంద్రాలను ప్రారంభించకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు మక్కలు కొనుగోలు చేయాలని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ డిమాండ్ చేశారు.మొక్కజొన్న పంట కోతకు వచ్చి రోడ్లపై మక్కలు ఆరబోసి మద్దతు ధర కోసం ఆశగా ఎదురుచూస్తున్న రైతులకు నిరాశనే ఎదురవుతుందని అన్నారు.అకాల వర్షాలతో పంట సరైన దిగుబడి రాక బాధ పడుతున్న రైతులకు బహిరంగ మార్కెట్లో ధర లేకపోవడం పంటను కోసి పదిహేను రోజులు దాటినా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. కేంద్రప్రభుత్వం మక్కజొన్నలకు క్వింటాలుకు 2400 రూపాయలు ధర నిర్ణయించినప్పటికీ ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడం వల్ల రైతులు బహిరంగ మార్కెట్లో ధర తక్కువగా ఉండడం వల్ల క్వింటాలుకు 400–500రూపాయలు రైతులు నష్టపోవాల్సి వస్తుందని అన్నారు.ఈ ప్రభుత్వానికి రైతుల పట్ల గానీ, వ్యవసాయంపట్ల గానీ ప్రాధాన్యత లేదని నిరూపితం అయిందన్నారు.రైతులు ఒకవైపు యూరియా కోసం పడరాని పాట్లు పడిన రోజులు మరువక ముందే మరోవైపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటుందని అన్నారు. ప్రభుత్వానికి ఏ మాత్రం రైతుల పట్ల చిత్తశుద్ధి ఉన్నా వెంటనే మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర అందించి కొనుగోలు చేయాలని లేని పక్షంలో రైతుల పక్షాన బిఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాన్ని కొనసాగిస్తామని అన్నారు.ఈ సందర్భంగా వారి వెంట మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, నాయకులు ఉమర్, శివకుమార్, నిజామోద్దీన్ తదితరులు ఉన్నారు

## బీఆర్ఎస్ బోగస్ ఓట్ల ఆరోపణలను కొట్టేసిన ఈసీ

- జూబ్లీహిల్స్ ఓటర్ల జాబితాపై బీఆర్ఎస్ నేతల ఆరోపణలు
- ఒకే ఇంటి నంబర్‌పై భారీగా ఓట్లున్నాయని ఫిర్యాదు..
- విచారణ జరిపిన జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్..
- ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిన అధికారులు




**హైదరాబాద్ (జూబ్లీ హిల్స్) అక్టోబర్ 14 కరపత్రం ప్రతినిది**
బీఆర్ఎస్ బోగస్ ఓట్ల ఆరోపణలను కొట్టేసిన ఈసీ ..జూబ్లీహిల్స్ ఓటర్ల జాబితాపై బీఆర్ఎస్ నేతల ఆరోపణలు ఒకే ఇంటి నంబర్‌పై భారీగా ఓట్లున్నాయని ఫిర్యాదు.. విచారణ జరిపిన జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ ..ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిన అధికారులు వివాదాస్పద చిరునామాలు అపార్ట్‌మెంట్లవని వెల్లడి ఓటర్లంతా పాతవారే, ఇటీవల కొత్తగా చేరికలు లేవని స్పష్టీకరణ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని కొన్ని ఇంటి నంబర్ల మీద భారీ సంఖ్యలో ఓట్లు నమోదు అయ్యాయంటూ భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నేతలు చేసిన ఆరోపణలపై హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి (డీఈవో) ఆర్వీ కర్ణన్ స్పష్టత నిచ్చారు. ఈ వ్యవహారంపై జరిపిన విచారణలో ఓటర్ల జాబితాలో ఎలాంటి అక్రమాలు జరగలేదని ఆయన సోమవారం తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ నేతలు ఆరోపించిన చిరునామాలు బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లకు చెందినవని విచారణలో తేలిందని ఆయన వివరించారు. ఒకే ఇంటి నంబర్‌పై ఎక్కువ ఫ్లాట్లు ఉండటంతో ఓటర్ల సంఖ్య అధికంగా కనిపించిందని తెలిపారు. 8-3-231/B/118 చిరునామాలో 50 మంది, 8-3-231/B/119లో 10 మంది, 8-3-231/B/164లో 8 మంది, 8-3-231/B/160లో 43 మంది ఓటర్లు ఉన్నారని, వారంతా అక్కడి ఫ్లాట్లలో నివసిస్తున్నవారేనని స్పష్టం చేశారు. ఈ ఓటర్లందరి పేర్లు 2023 నుంచే జాబితాలో ఉన్నాయని, వారు గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటు హక్కును కూడా వినియోగించుకున్నారని ఆర్వీ కర్ణన్ పేర్కొన్నారు. సరైన చిరునామాల ఆధారంగానే వారికి ఓటరు గుర్తింపు కార్డులు జారీ చేశామని, ఇటీవలి నెలల్లో ఈ చిరునామాలపై కొత్తగా ఒక్క ఓటు కూడా నమోదు కాలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ విచారణతో బీఆర్ఎస్ నేతలు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని తేలింది.

## బీజేపీ కార్పొరేటర్ నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసుల దాడి కార్పొరేటర్

**– భర్తతో పాటు 10 మంది అరెస్ట్**



**వరంగల్ జిల్లా అక్టోబర్ 14 కరపత్రం ప్రతినిధి**
గ్రేటర్ వరంగల్ బీజేపీ కార్పొరేటర్ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు కార్పొరేటర్ భర్తతో పాటు 10 మంది అరెస్ట్ వరంగల్ నగరంలోని సుబేదారి కనకదుర్గ కాలనీలోని బీజేపీ కార్పొరేటర్ గుజ్జుల వసంత ఇంట్లో పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు ఈ దాడిలో కార్పొరేటర్ భర్త గుజ్జుల మహేందర్ రెడ్డితో సహా మరో 10 మంది(ముగ్గురు మహిళలు)ని అరెస్టు చేసి వారి నుండి రూ.60 వేలు, 9 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

## హైదరాబాద్ శివారులో రేవ్ పార్టీ కలకలం



**– 14 మంది మహిళలతో సహా మొత్తం 50 మంది అరెస్ట్ .**

మహేశ్వరంలోని కే. చంద్రారెడ్డి రిసార్ట్ పై దాడులు నిర్వహించిన రాచకొండ ఎస్ఓటీ పోలీసులు ఏపీకి చెందిన ఫర్టిలైజర్ కంపెనీ పార్టీ ఏర్పాటు చేసినట్లు గుర్తింపు వివిధ డీలర్లకు పార్టీ ఏర్పాటు చేసిన ఫర్టిలైజర్ కంపెనీ ఇందులో 14 మంది మహిళలతో సహా మొత్తం 50 మంది ఉద్యోగులు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు పార్టీలో లిక్కర్‌తో పాటు అమ్మాయిలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

## గాడిద చర్మం నుంచి ఔషధాల తయారీ

**పాక్ నుంచి 2వేల గాడిదలు కొన్న చైనా**

**కరపత్రం ప్రతినిధి లాహోర్,అక్టోబరు14**
:చైనా తాజాగా పాకిస్థాన్ నుంచి రెండు వేల గాడిదలను కొనుగోలు చేసింది. పాకిస్థాన్ నుంచి చైనా అత్యధికంగా గాడిదలను దిగుమతి చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో 2024లో ఈ రెండు దేశాల మధ్య డీల్ కుదిరింది. ఈ డీల్ ప్రకారం చైనాకు పాకిస్థాన్ 20 వేల గాడిదలను ఎగుమతి చేయాలి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌లోని కరాచీ పోర్ట్‌కు సమీపంలో ఓ భారీ కబేళాను నిర్మించాలని చైనా భావిస్తోంది. పాకిస్థాన్‌లో ప్రస్తుతం 52 లక్షల గాడిదలు ఉన్నాయి. ప్రపంచంలో అత్యధిక గాడిదలను కలిగిన మూడో దేశంగా పాకిస్థాన్ ఉంది.ఈ నేపథ్యంలో పాకిస్థాన్ గాడిదలను దిగుమతి చేసుకునేందుకు చైనా గతేడాది ఒప్పందం కుదుర్చుకుంది. గాడిద చర్మంతో చైనాలో సాంప్రదాయ ఔషధాలను తయారు చేస్తారు. గాడిద చర్మాన్ని ఉపయోగించి ఎజియావో అనే సాంప్రదాయ ఔషధాన్ని చైనీయులు తయారు చేస్తారు. ఈ ఔషధం రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికి, అలసట, కణితులను తగ్గించడానికి, రక్తహీనత చికిత్సకు సాయపడుతుందని చైనీయులు నమ్ముతారు. ఎజియావో ఔషధానికి చైనాలో భారీ డిమాండ్ ఉంది . అయితే ఈ ఔషధ తయారీకి తగినన్ని గాడిదలు చైనాలో లేవు. దీంతో గాడిదల కోసం పాకిస్థాన్‌పై ఆధారపడుతున్నారు. అయితే చైనా డీల్ కారణంగా పాక్‌లో గాడిదలకు విపరీతమైన డిమాండ్ పెరిగిందని సమాచారం. ఐదేళ్ల క్రితం ఒక్కో గాడిద ఖరీదు రూ.30 వేలుగా ఉండేదట. ప్రస్తుతం పాక్‌లో ఒక్కో గాడిద ఖరీదు రూ.2 లక్షలకు పైగా పలుకుతోందట. దీంతో గాడిదలను ఉపయోగించి పనులు చేసుకుని పాక్ వాసులు కష్టాలు పడుతున్నారట.